క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ కార్యకర్తకు ఎమ్మెల్యే బూచేపల్లి పరామర్శ



బాలకృష్ణారెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

ముండ్లమూరు (దర్శి): మండలంలోని పసుపుగల్లులో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన వైఎస్సార్ సీపీ కార్యకర్త బాలకృష్ణారెడ్డిని దర్శి ఎమ్మెల్యే, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి శనివారం పరామర్శించారు. ప్రమాదానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. బూచేపల్లితో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

పాపారావుకు నివాళి



పాపారావు భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి

దర్శి: వైఎస్సార్ సీపీ కార్యకర్త తోట పెద్ద పాపారావు కుటుంబానికి అండగా ఉంటామని దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. చందలూరు గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త పాపారావు మృతి చెందిన సంఘటన తెలుసుకుని శివప్రసాద్‌రెడ్డి ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతికి కారణాలు అడిగి తెలుసుకున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ముండ్లమూరు విద్యార్థులు



బాలికలను అభినందిస్తున్న ఉపాధ్యాయుడు

ముండ్లమూరు (దర్శి): మండలంలోని ఉమామహేశ్వరపురం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు మాధురి, తేజస్విని, భావన, భాగ్యశ్రీలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. శనివారం చీమకుర్తిలో జరిగిన జిల్లాస్థాయి బేస్ బాల్ పోటీల్లో వీరు ప్రతిభ కనపరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు తిరుపతిస్వామి తెలిపారు. విద్యార్థినులను ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.

రైతులకు శనగ విత్తనాల పంపిణీ



శనగ విత్తనాలు అందజేస్తున్న ఏఓ బుజ్జిబాయి

పెద్దారవీడు: మండలంలోని గొబ్బూరు రైతు సేవా కేంద్రంలో సబ్సిడీ శనగ విత్తనాలను వ్యవసాయాధికారి కె.బుజ్జిబాయి శనివారం పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సబ్సిడీ శనగ దేశీ రకాలైన జేజీ 11 రకం విత్తనాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 25 శాతం రాయితీతో శనగ విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని, క్వింటా పూర్తి ధర రూ.9,400 ఉండగా 25 శాతం సబ్సిడీ రూ.2,350 పోను మిగిలిన రూ.7,050 చెల్లించి శనగ విత్తనాలు రైతు పొందాలన్నారు. రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, మొబైల్ ఫోనుతో రైతు సేవా కేంద్రాలకు వచ్చి పేరు నమోదు చేసుకొని డబ్బులు చెల్లిస్తే శనగ విత్తనాలు తెప్పించగలమని పేర్కొన్నారు. వీఏఏ విజయలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

ఫసల్ బీమాపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

తాళ్లూరు: జిల్లాలో ప్రతి రైతుకు ఫసల్ బీమా యోజనపై అవగాహన ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని బెల్లంకొండవారిపాలెం, దోసకాయలపాడు గ్రామాల్లో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనపై అవగాహన కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో ఆరు పంటలకు బీమా వర్తించేలా నోటిఫైడ్ చేశామని చెప్పారు. రైతులు మారుతున్న వాతావరణ పరిస్థితులతో పంటలు నష్టపోతే ఆశించిన ఫలితాలు రాకపోతే రైతులను ఫసల్ బీమా ఆదుకుంటుందన్నారు. డిసెంబర్ 15లోపు రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి బి.ప్రసాద్‌రావు, సర్పంచ్ పోశం సుమలత, ఎంపీటీసీ సరస్వతి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాల ఏర్పాటంతా మాయే

- విద్యార్థులకు ఆధార్ కేంద్రాలతో ఉపయోగం శూన్యం
- కూటమి ప్రభుత్వ చర్యలతో లబోదిబోమంటున్న విద్యార్థులు



ఆధార్‌లో డేట్ ఆఫ్ బర్త్ సవరణ చేయించుకుంటున్న విద్యార్థిని

కురిచేడు: పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఆధార్ కేంద్రంలో డేట్ ఆఫ్ బర్త్ సవరణలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. జిల్లాలో సుమారు 300పైగా ఆధార్ కేంద్రాలు మంజూరు చేసి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించింది. వాటిల్లో పని చేస్తోంది కేవలం 20 లోపు కేంద్రాలే. పైగా విద్యార్థులకు ఆధార్‌లో డేట్ ఆఫ్ బర్త్ అప్ డేట్ జరగకపోవటం గమనార్హం. కంప్యూటర్‌లు మరమ్మతులకు గురైనా, విడిభాగాలు అవసరమైనా వాటిని ఏర్పాటు చేయకుండా పని చేయమనడం నిర్వాహకులకు ఇబ్బందిగా మారింది. తాళం వేసితిని గొళ్లెం మరిచి తిని అన్న చందంగా ప్రభుత్వం తీరు తయారైంది. ఆధార్‌లో డేట్ ఆఫ్ బర్త్ సరి చేసేందుకు జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరి చేసింది. కానీ ఆలస్యంగా జనన ధ్రువీకరణ పత్రం పొందడం చాలా కష్టతరం. దానికి కనీసం మూడు నెలల సమయం పడుతుంది. ఆధార్‌లో, పాఠశాలలో జనన తేదీ ఒకటే ఉండాలనే షరతు విధించి విధి విధానాల్లో సవరణలు చేయక పోవడంతో విద్యార్థుల్లో కనీసం పది శాతం మందికి కూడా ఆధార్‌లో డేట్ ఆఫ్ బర్త్ సవరణ జరగలేదు. మండలంలో రెండు ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు ప్రకటనలు గుప్పించినా కేవలం ఒక్కటి మాత్రమే పని చేస్తోంది. మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేసుకుని మండలంలోని ఆవులమంద గ్రామంలోని సచివాలయానికి వెళ్లినా అక్కడ సర్వర్ పనిచేయకపోవటం, జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరి కావడంతో విద్యార్థులు సాయంత్రం వరకు ఎదురు చూసి నిరాశగా వెనుదిరిగారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి విద్యార్థులకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఇచ్చే ధ్రువీకరణను, లేకపోతే ప్రభుత్వ వైద్యాధికారులతో సర్టిఫికెట్ ఇప్పించి పాఠశాలలో నమోదు చేసిన డేట్ ఆఫ్ బర్త్‌ను ఆధార్‌లో సవరణ చేసే అవకాశాన్ని ఇస్తే విద్యార్థులకు మేలు జరుగుతుంది.

ఎంఈఓల అవినీతిపై దర్యాప్తు చేయాలి



అత్యవసర సమావేశానికి హాజరైన యూటీఎఫ్ సభ్యులు

కురిచేడు: మండల విద్యాశాఖాధికారుల అవినీతిపై క్షేత్రస్థాయిలో దర్యాప్తు చేస్తే వాస్తవాలు బయట పడతాయని యూటీఎఫ్ మండల శాఖ డిమాండ్ చేస్తోంది. ఇటీవల ఎంఈఓలపై విడుదలైన కరపత్రాల్లోని విషయాలు వాస్తవాలని, ఉపాధ్యాయులను ఆందోళనకు గురిచేస్తున్నారని వారు నిర్ధారించారు. మండల శాఖలోని సుమారు 22 మంది సభ్యులు శనివారం సాయంత్రం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ గోడౌన్ ప్రాంగణంలో అత్యవసర సమావేశం నిర్వహించి పలు తీర్మానాలు చేశారు. ఉపాధ్యాయులను బెదిరిస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. కరపత్రంలోని విషయాలు వాస్తవాలని యూటీఎఫ్ శాఖ పరోక్షంగా నిర్ధారిస్తోంది. వీరి అవినీతిపై కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి నిజనిర్ధారణ చేసి వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సమావేశంలో మండల శాఖ అధ్యక్షుడు ఏ.శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ జి. కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శులు టి.రాజశేఖర్, డి.వెంకటరెడ్డి, మండల శాఖ గౌరవాధ్యక్షుడు షేక్ ఖాదర్‌వలి, జిల్లా ఆడిట్ కమిటీ కోశాధికారి కె.పూర్ణచంద్రరావు, సహాధ్యక్షుడు డి.జాన్‌బాబు, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ కె.రామకృష్ణ, సీనియర్ నాయకులు వి. రామచంద్రరావు, ఎం.శ్రీనివాసరెడ్డి, యూ.అంకయ్య, ఎన్. చంద్రశేఖర్, బి.శ్రీనివాసరావు, బి.చక్రపాణి, డి.లక్ష్మయ్య, పి.అన్వర్‌బాషా, ఎం.శ్రీనివాసులు, బి.మణికుమార్, వై.వెంకటేశ్వర్లు, ఎస్.శ్రీనివాసరావు, టి.సుబ్బయ్య, ఏ.మల్లికార్జునరావు పాల్గొన్నారు.

భయంతోనే ఎదుటి వారిపై నిందలు

- వైఎస్సార్ సీపీ నాయకులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

యర్రగొండపాలెం: అధికార పార్టీకి చెందిన టీడీపీ నాయకులు చేస్తున్న అక్రమ వ్యాపారాలపై అధికారులు చర్యలు తీసుకుంటారన్న భయంతో ఎదుటి వారిపై ఆ పార్టీ నాయకులు నిందలు మోపుతున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు ఆరోపించారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుముల శ్రీనివాసరెడ్డి, మండల అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, ఎస్సీ సెల్ నాయకుడు ఎలిసెల కోటేశ్వరరావు మాట్లాడారు. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ టీడీపీ నాయకులు చేస్తున్న అక్రమ దందాపై చేసిన ఆరోపణలకు అనుగుణంగా మరుసటి రోజే యర్రగొండపాలెం మండలానికి చెందిన టీడీపీ నాయకులు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని కంభంలోని కందులాపురం సెంటర్‌లో సబ్ కలెక్టర్ పట్టుకున్నారని, శుక్రవారం రాత్రి మండలంలోని సాయిబాబా నగర్‌లో రవాణాకు సిద్ధంగా ఉన్న లారీని పట్టుకున్న విషయాన్ని పచ్చనేతలు విస్మరిస్తే ఏలాగని ప్రశ్నించారు. పుల్లలచెరువు మండలానికి చెందిన టీడీపీ నాయకుడు యర్రగొండపాలెంలో తాను అక్రమంగా నడుపుతున్న కోత మిషన్‌పై ఎక్కడ చర్యలు తీసుకుంటారన్న భయంతోనే తనపై వ్యక్తిగత నిందలను మోపుతున్నాడని, ఆ నాయకుడి ఆధ్వర్యంలో మండలంలో అనేక అరాచకాలు జరిగాయని శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ కాలంలో ఉద్యోగాలు చేస్తున్న టీడీపీ వర్గానికి చెందిన వారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని, ఇది తమ పార్టీ సంస్కారం అని, ప్రస్తుతం అధికారం వచ్చిందన్న అహంభావంతో వైఎస్సార్ వర్గానికి చెందిన వారిపై కక్షసాధింపు చర్యలకు దిగారని ధ్వజమెత్తారు. 2014–19 సంవత్సరంలో టీడీపీ అధికారంలో ఉందని, ఆ సమయంలో యర్రగొండపాలెంలోని మోడల్ డిగ్రీ కళాశాల భవనాల నిర్మాణాలు, వై.పాలెం నుంచి త్రిపురాంతకం, పుల్లలచెరువుకు వెళ్లే రహదారులను పూర్తి చేయకుండా పబ్బం గడుపుకొని మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఎటువంటి అభివృద్ధి చేయలేదని ఆరోపిస్తున్నారని, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వ కాలంలో మాజీ మంత్రి నియోజకవర్గ కేంద్రంలో 100 పడకల వైద్యశాల, పెద్దదోర్నాలలో గిరిజన మల్టీ స్పెషాలిటీ వైద్యశాల, వైపాలెంలో ఆర్టీసీ బస్టాండ్, మార్కెట్ యార్డుకు సొంత భవనాలు ఏర్పాటు చేశారని, పుల్లలచెరువు మండలాన్ని సస్యశ్యామలం చేసేందుకు టీ–5 కాలువను మంజూరు చేయించారని, ఇవి అభివృద్ధి ఫలనులు కావా అని ఆయన ప్రశ్నించారు. అక్రమంగా కోత మిషన నడుపుకునే ఆ నాయకుడికి 20 సంవత్సరాల క్రితం 2 ఎకరాల పొలం మాత్రం ఉండేదని, ఇప్పుడు రూ.1 ట్యాక్స్ కడుతున్నానని ప్రగల్భాలు పలుకుతున్నాడని, ఆ డబ్బు అంతా అక్రమంగా సంపాదించిందేనని అన్నారు. ఇప్పటికైనా వ్యక్తిగత దూషణలు మాని సంస్కారవంతంగా మెలగాలని ఆయన వైఎస్సార్ సీపీ నాయకుడు శ్రీనివాసరెడ్డి హితవు పలికారు.

సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ ఎం.బాల గురవయ్య, సర్పంచ్‌లు తమ్మినేని సత్యనారాయణ, ఆవుల కోటిరెడ్డి, ఆవుల రమణారెడ్డి, గడ్డం సుబ్బయ్య, బసివిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శెనగ వెంకటరెడ్డి, ఒంగోలు సుబ్బారెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి, రాములు నాయక్ పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం అందించాలి

- ఆరోగ్యమిత్రలు నల్లబ్యాడ్జిలతో నిరసన



నల్లబ్యాడ్జితో విధులు నిర్వహిస్తున్న చంద్రశేఖర్

పెద్దదోర్నాల: ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు సమాన పనికి సమాన వేతనం అందించాలని కోరుతూ మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఆరోగ్య మిత్రలు శనివారం నల్లబ్యాడ్జిలతో విధుల నిర్వహిస్తూ తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైద్యమిత్ర మందగిరి చంద్రశేఖర్, సాంబయ్యలు మాట్లాడుతూ దాదాపు 18 ఏళ్ల నుంచి ఆరోగ్యమిత్రలుగా, డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవలో తాము విధులు నిర్వహిస్తున్నామన్నారు. అన్నేళ్ల నుంచి గవర్నమెంట్ ఔట్ సోర్సింగ్ ద్వారా పని చేస్తున్నా తమకు 13 వేల రూపాయలు మాత్రమే జీతంగా ఇస్తున్నారని వాపోయారు. పేషెంట్లు వైద్యశాలకు వచ్చిన వద్ద నుంచి వారు ఆరోగ్యంగా ఇంటికి వెళ్లేంత వరకు వారికి ఆరోగ్యశ్రీ ద్వారా సేవలందిస్తున్నామన్నారు. ప్రభుత్వం అందించే పథకాలు కూడా తమకు అందడం లేదన్నారు. చాలీ చాలని జీతాలతో తాము తమ కుటుంబ సభ్యులను ఎలా పోషించుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరగకుంటే ఈ నెల 29వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఎన్టీఆర్ వైద్యసేవలో పని చేస్తున్న ఉద్యోగులందరూ విధులు బహిష్కరించి ధర్నా చేయనున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదాలు నివారించాలి



లైటింగ్ బోర్డును ఏర్పాటు చేస్తున్న ఎస్ఐ అనిల్

పెద్దారవీడు: రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పి. అనిల్‌కుమార్ అన్నారు. మండలం పరిధిలో జాతీయ రహదారి దేవరాజుగట్టు గ్రామం సమీపంలో ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో జేసీబీ సాయంతో రోడ్డుకు పక్కన ఉన్న చిల్లకంపను పోలీసులు శనివారం తొలగించారు. ఎస్ఐ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రదేశాల్లో లైటింగ్, సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని, రోడ్డు ప్రమాదాలు అరికట్టేందుకు ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. పోలీసులు పాల్గొన్నారు.

భూముల రీసర్వేలో తప్పులుంటే సరిచేసుకోవచ్చు



దొనకొండలో మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్



అర్జీలు పరిశీలిస్తున్న తహసీల్దార్ నాగలక్ష్మి

దొనకొండ: గ్రామసభలు నిర్వహించి భూములు రీసర్వేపై తప్పులు జరిగితే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ కె.నాగార్జునరెడ్డి అన్నారు. రీ సర్వే భూముల పరిష్కార గ్రామసభలు శనివారం మండలంలోని ఆరవల్లిపాడు సచివాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడుతూ రీ సర్వే జరిగిన గ్రామాల్లో భూమి కొలతలు, విస్తీర్ణంలో మార్పులు తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. వెబ్ ల్యాండ్-2లో ఉన్న భూమికి వ్యత్యాసం ఉంటే తగిన ఆధారాలతో గ్రామసభలో అర్జీలు అందజేయాలన్నారు. గ్రామసభలో సర్పంచ్ బాపనపల్లి మంగమ్మ, ఎంపీటీసీ కమ్మ నారాయణమ్మ, ఆర్ఐ రామారావు, వీఆర్ఓ బొర్రయ్య, సర్వేయర్ మస్తాన్ దర్బార్‌వలి, వెంకటరావు పాల్గొన్నారు.

తాళ్లూరు: భూసమస్యల పరిష్కారం కోసమే గ్రామసభ నిర్వహిస్తున్నామని తహసీల్దార్ నాగలక్ష్మి తెలిపారు. మండలంలోని దోసకాయలపాడు రెవెన్యూ విలేజిలో గ్రామసభ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగలక్ష్మి మాట్లాడుతూ రీ సర్వేలో ప్రతి రైతుకు న్యాయం జరుగుతుందన్నారు. ప్రతి రైతు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ బి.మల్లికార్జున్, వీఆర్వో శివారెడ్డి పాల్గొన్నారు.

పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

- జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

దర్శి: ప్రస్తుతం సాగు చేస్తున్న పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో అక్టోబర్ మాసానికి జరిగిన శిక్షణ మరియు సందర్శన కార్యక్రమానికి ఆయన శనివారం హాజరై వ్యవసాయశాఖ అధికారులనుద్దేశించి మాట్లాడారు. వ్యవసాయ పరిశోధనాస్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పి.సంధ్యారాణి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం కురిసిన వర్షాలకు పంటల్లో చీడపీడలు ఆశిస్తాయని, వాటిని గమనించి తక్షణమే సస్యరక్షణ చర్యలు చేపట్లాని సబ్ డివిజన్ అదనపు వ్యవసాయ సంచాలకులు ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. రబీ పంటల్లో వేసుకోదగ్గ రకాలు మరియు యాజమాన్య పద్ధతుల గురించి డాక్టర్ పి.సంధ్యారాణి వివరించారు శనగ, మినుము, వరి పంటల్లో రబీకి సాగు చేసుకోదగ్గ రకాలు వివరించారు. వరిలో ఆశించే ఆకుముడత, అగ్గి తెగులు, పాముపాడ తెగులు, ఉల్లికోడు లక్షణాలు, యాజమాన్య పద్ధతుల గురించి శాస్త్రవేత్త డాక్టర్ వరప్రసాదరావు తెలిపారు. ప్రస్తుత పంటల్లో వేసుకోవాల్సిన ఎరువుల యాజమాన్యం, కలుపు నివారణ పద్ధతుల గురించి ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ రమేష్ వివరించారు. మిరప మరియు కూరగాయల పంటల్లో వచ్చే పురుగులు, తెగుళ్ల గురించి ఉద్యాన పరిశోధనా స్థానం హెడ్ డాక్టర్‌రవీంద్రబాబు వివరించారు. దర్శి, మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు, కనిగిరి, ఒంగోలు సబ్ డివిజన్ల ఏడీఏలు, వ్యవసాయాధికారులు, కేవీకే వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

భారతి సిమెంట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

- ఉత్సహంగా రక్తదానం చేసిన యువకులు



రక్తదానం చేస్తున్న డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని శ్రీశైలం రహదారిలో భారతి సిమెంట్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. దీంతో శిబిరంలో పాల్గొన్న 32 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. మండల కేంద్రానికి చెందిన భారతి సిమెంట్ జయ గోవర్ధన్ ట్రేడర్స్ జగదీశ్వరరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన రక్తదాన శిబిరాన్ని పెద్దదోర్నాల మేజర్ పంచాయతీ కార్యదర్శి శివ కోటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న మన ఆపద్బంధు సర్వీస్ సొసైటీ ఫౌండర్, ప్రభుత్వ వైద్యులు సాయికిరణ్‌రెడ్డి మాట్లాడుతూ రక్తదానంతో గర్భిణులు, బాలింతలు, కాన్సర్ వ్యాధిగ్రస్తులు, ప్రాణాపాయంలో ఉన్న వారిని కాపాడుకోవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేసి ప్రాణాపాయం ఉన్న వారిని కాపాడాలని కోరారు. పలువురు యువకులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు.

మోడల్ పాఠశాలలో గెస్టు టీచర్లుగా అవకాశం

పెద్దదోర్నాల:

మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ పాఠశాలలో అతిథి బోధన చేసేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఈశ్వర్‌సింగ్ భరద్వాజ్ తెలిపారు. సీబీఎస్ఈ సిలబస్‌లో బోధించుటకు పీజీటీ ఫిజిక్స్–1, టీజీటీ తెలుగు–1, టీజీటీ హిందీ–1 పోస్టులకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు 21 సంవత్సరాల నుంచి 60 ఏళ్లు ఉండాలన్నారు. నవోదయ కేంద్రీయ విద్యాలయంలో, స్టేట్ గవర్నమెంట్ సంస్థల నుంచి పదవీ విరమణ చేసిన వారు 60 ఏళ్ల నుంచి 65 ఏళ్లలోపు ఉపాధ్యాయులు నవంబర్ 14 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ పాఠశాల, శ్రీశైలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి అందజేయాలన్నారు. వివరాలకు ప్రిన్సిపాల్ 94160 94165 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

డీఎస్సీ శిక్షణ దరఖాస్తు గడువు పొడిగింపు

దర్శి: రాష్ట్ర ప్రభుత్వం సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖల ద్వారా నిరుపేద ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత వసతి సదుపాయాలతో డీఎస్సీ శిక్షణకు దరఖాస్తు గడువు పెంచినట్లు సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ షేక్ రాబియా బేగం తెలిపారు. గతంలో అభ్యర్థుల దరఖాస్తుకు తుది గడువు ఈ నెల 25గా నిర్ణయించింది. దాన్ని ఎక్కువ మంది సద్వినియోగం చేసుకునేందుకు ఆ గడువును ఈ నెల 27 వరకు పొడిగించి దరఖాస్తుకు వీలుగా జ్ఞానభూమి వెబ్‌పోర్టల్లో సేవలను అందుబాటులో ఉంచినట్లు ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన అభ్యర్థులు, శిక్షణ సంస్థల యాజమాన్యాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పరుగు పందెం పోటీకి వైడీపాడు విద్యార్థి ఎంపిక



పరుగు పందేనికి ఎంపికైన విద్యార్థితో ఉపాధ్యాయులు

పెద్దారవీడు: మండలంలో ఏనుగులదిన్నెపాడు జెడ్పీహెచ్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి సాయిచరణ్ రాష్ట్రస్థాయి గేమ్స్ అండ్ ఫెడరేషన్‌కు ఎంపికైనట్లు హెచ్ఎం షేక్ అహ్మద్ శనివారం తెలిపారు. జిల్లా స్థాయి గేమ్స్ అండ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఒంగోలులో అండర్–17 విభాగం 400 పరుగు పందెంలో మొదటి స్థానంలో నిలిచాడని, త్వరలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటాడని పేర్కొన్నారు. హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, నేటి పోటీ ప్రపంచంలో క్రీడలు మానసిక ఉల్లాసం, శారీరక ధారుఢ్యాన్ని, మంచి ఆరోగ్యానికి ఉపయోగపడతాయని తెలిపారు. క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులు గెలుపు కోసమే కాకుండా కలిసి కట్టుగా ఐక్యంగా పనిచేయాలనే స్ఫూర్తి నింపుతాయన్నారు. ఎంపికైన విద్యార్థి సాయిచరణ్‌ను పాఠశాల చైర్మన్ ఏర్వ రామ్మోహనరెడ్డి, ఉపాధ్యాయులు పి.వెంకటప్పారెడ్డి, పీడీలు చంద్రయ్య, సురేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

లంపి స్కిన్ వ్యాధితో రెండు ఆవులు మృతి

- పలు ఆవులకు వ్యాధి ఉన్నా పట్టించుకోని పశువైద్యాధికారులు
- ఆందోళనలో పశుపోషకులు



లంపి స్కిన్ వ్యాధి సోకి మృతి చెందిన ఆవు (ఫైల్)



మిగిలిన ఆవులతో కలిసి తిరుగుతున్న వ్యాధి సోకిన ఆవు

కురిచేడు:

పశువుల్లో లంపి స్కిన్ వ్యాధి ప్రమాదకరమైంది. ఈ వ్యాధి సోకిన పశువులకు సరైన చికిత్స అందకుంటే మృత్యువాత పడతాయి. అంతే కాకుండా వాటి ద్వారా ఇతర పశువులకు వ్యాధి సంక్రమిస్తుంది. ఈ వ్యాధి రాకుండా ముందస్తుగా టీకాలు వేస్తారు. వ్యాధి సోకిన వాటిని ప్రత్యేకంగా ఉంచి చికిత్స అందిస్తారు. మండలంలోని గంగదొనకొండ శ్రీ గంగాభవాని అమ్మవారి ఆలయానికి భక్తులు ఇచ్చిన గోవు లంపి స్కిన్ వ్యాధితో మృతి చెందింది. పొట్లపాడులోని కొండ గురవయ్యకు చెందిన గోవు కూడా ఇదే వ్యాధితో మృతి చెందింది. గంగదొనకొండ ఆలయానికి చెందిన మరో ఆవుదూడకు వ్యాధి సంక్రమించడంతో గ్రామస్తులు వెంటనే ప్రైవేటు వైద్యులను సంప్రదించి వైద్య చికిత్స అందించటంతో ఆ దూడ కోలుకుంది. కురిచేడులో మరో గోవుకు ఈ వ్యాధి సంక్రమించి ఉంది. ఆ గోవు మిగిలిన వాటితో కలిసి గ్రామంలో విచ్చలవిడిగా తిరుగుతోంది. ఆ గోవులకు కూడా వ్యాధి సంక్రమించే అవకాశాలు లేకపోలేదు.

పేరుకే పశువైద్యశాల

మండలంలో ఒకే ఒక ప్రభుత్వ పశువైద్యశాల ఉంది. దానికి సహాయ సంచాలకులు స్థాయి అధికారితో పాటు మరో డాక్టర్ పోస్టు ఉంది. వారిద్దరూ డిప్యుటేషన్‌పై వెళ్లారు. వారి స్థానంలో వేరే వారిని డిప్యుటేషన్‌పై ఇక్కడ నియమించారు. అయితే వారు కూడా సక్రమంగా ఆస్పత్రికి రాకపోవడమే కాకుండా మండలంలోని పశువులకు వైద్యసేవలు అందించక పోవడంతో పశుపోషకులకు ఈ సీజన్‌లో వాటిని కాపాడుకోవటం కష్టంగా మారింది. ఇద్దరు వైద్యులు అందుబాటులో ఉండి పశువులకు వైద్యం అందించి ఉంటే రెండు గోవులు లంపి స్కిన్ డిసీజ్ (ఎల్ఎస్‌డీ)తో మృతి చెంది ఉండేవి కాదని పశుపోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పశువైద్యశాఖ డైరెక్టరేట్ కార్యాలయం స్పందించి వెంటనే రెగ్యులర్ పశువైద్యులను నియమించి పశువులకు వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోకుంటే మండలంలో పశువులకు రక్షణ లేకుండా పోతుందని పలువురు పశుపోషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.